

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

జిన్ రాతోమే నీంద్ ఉడ్ జాతీ హై
క్యా కహర్ కి రాతే హోతీ హై
దర్‌వాజో సే టకరా జాతే హై
దీవారోంసె బాతే హోతీ హై

1949లో విడుదలయిన 'రాత్ కీ రానీ ' సినిమాలో మరుపురాని పాట ఇది. ఆ సినిమా ప్రింట్ దొరకకపోయినా, సినిమాపేరును సజీవంగా నిలిపినపాట ఇది. ముఖ్యంగా నిద్ర రాని రాత్రిళ్లు, నిద్రలేని రాత్రిళ్లలో తప్పనిసరిగా గుర్తుకు వచ్చే పాట ఇది. మహమ్మద్ రఫీ ఈ పాటలో ప్రతి పదాన్ని పలికిన తీరు, పాటలోని ఒంటరి తనాన్ని, నిద్రరాని రాత్రులలో హృదయం అనుభవించే వేదనను పదే పదే అనుభవానికి తెస్తుంది. వేదనను ఉపశమింపచేస్తుంది. నిద్రలేని రాత్రులలో ఈ పాటను వింటూ మేల్కొనటం అద్భుతమైన అనుభవంలా ఎదిగిస్తుంది. అంతేకాదు, ప్రశాంత రాత్రిలో, చీకటిలో, తారలు లేని ఆకాశాన్ని చూస్తూ, నిద్రలో జోగుతున్నట్టున్న చెట్లను, తలలు వాల్చేసిన ఆకులను చూస్తూ, నిశ్శబ్దంలో ఈ పాటను వింటూంటే హృదయంలోని అశాంతి అదృశ్యమైపోతుంది. నిద్రరాని ఒంటరి రాత్రులను మించిన మరపురాని అనుభవం మరొకటి లేదనిపిస్తుంది.

మహమ్మద్ రఫీ ఇతర గాయకులకన్నా తాను భిన్నం అని నిరూపించుకుని, తనదైన ప్రత్యేకతను సాధించటంలో తొలి అడుగులు బలంగా పడిన సంవత్సరం 1949. గాయకుడిగా రఫీ జీవితంలో అత్యంత ప్రాధాన్యం వహించిన సంవత్సరం ఇది. అంతకుముందు పలు సంగీత దర్శకులకు పాటలు పాడినా, 1949లో సంగీత దర్శకులు తమ అత్యుత్తమ బాణీలను, విభిన్నమైన బాణీలను, ముఖ్యంగా ఉచ్చస్వరంలో పాడాల్సిన పాటలకు మహమ్మద్ రఫీని వాడటం ఈ సంవత్సరంలో కనిపిస్తుంది. మంద్రస్థాయి నుంచి ఉచ్చస్థాయికి వెళ్లి వెంటనే మళ్లీ మామూలుగా పాడగలిగే రఫీ ప్రతిభ ప్రస్ఫుటమయింది ఈ సంవత్సరంలోనే. ముఖ్యంగా, రఫీ సోలో పాటలు, తమంతట తాముగా, ఇతర గాయనీగాయకుల పాటలను తట్టుకుని ప్రత్యేక గుర్తింపును పొందటం ఆరంభమయింది 1949లోనే. అన్నిటికన్నా ముఖ్యంగా, రఫీ గాన శైలి వినూత్న పోకడలు పోవటం 1949లో ఆరంభమయింది. ఈ సంవత్సరంలో అత్యధిక ప్రజాదరణ పొందిన రఫీ పాటలను గమనిస్తే, సంగీత దర్శకులు మహమ్మద్ రఫీ స్వరంలోని గొప్పతనాన్ని గుర్తించి దాన్ని వెలికి తెచ్చి అత్యద్భుతమైన గీతాల సృజన ప్రయోగాలు ఆరంభించినట్టు తెలుస్తుంది. పండిట్ హుస్న్ లాల్భగత్ రాం, జల్‌తరంగ్ సినిమాలో ఏడుపాటలు రఫీతో పాడించాడు. అంతకు ముందు సంవత్సరం 'ప్యార్ కే జీత్ ' సినిమాలో 'ఎక్ దిల్ కే టుక్డే హజార్ హువే' విపరీతమైన ప్రజాదరణ పొందింది.. 'బన్సారియా' సినిమాలో 'తెరియార్ హం భూల్ గయే' సూపర్ హిట్. 'బడీ బహన్'లో 'మొహబ్బత్ కె ధోకే మే కోయీ న ఆయే' ఈ నాటికీ ప్రేమ ఒక మోసం అని, ప్రేమిస్తే మిగిలేవి కన్నీళ్లే అని యువతీ యువకులను హెచ్చరిస్తూనే ఉంది. ముఖ్యంగా 'ముఝే జబ్‌కిసీ సె మొహబ్బత్ నహీథీ, తొ ఆంఖోకొ రోనేకి ఆదత్ నహీథీ 'లో మొహబ్బత్ లో హ అన్నప్పుడు విషాదాన్ని ధ్వనింపచేసి, ఆంఖోని ఒత్తి పలికి 'రోనే ' అన్న దగ్గర ఏడుపును ధ్వనింపచేసి 'ఆదత్' అన్న దగ్గర 'కసి'ని చూపించి 'నహీథీ' అనటంలో కోల్పోయిన ప్రేమను తలచుకుని నిట్టూర్చేట్టు పాడి తన గాన సంవిధాన

శైలిని వినూత్నమని పాటలుపాడటంలో ఒక కొత్త శైలి మెరుపులు చూపించాడు.రఫీ. శంకర్‌జైకిషన్ సంగీత దర్శకత్వంలో బర్సాత్ సినిమాలోని 'మై జిందగీ మె హర్ దం రోతాహి రహాహూన్ ' విషాద గీతాలను వేగవంతం చేసిన ట్రెండ్ సెట్టర్. 'నౌషాద్ ' సంగీత దర్శకత్వంలోని 'దిల్లగీ' సినిమాలో 'తెరె కూచేమె ఆర్మోనోంకి దునియా లేకె ఆయాహూ' రఫీ విషాద గీతాల్లో విభిన్నమైనది. ముఖ్యంగా చరణంలో 'ఆరేవో ' అంటూ పాట అందుకోవటం అద్భుతం అనిపిస్తుంది. ఇదే సినిమాలోని 'ఇస్ దునియా మే ఏయ్ దిల్‌వాలో దిల్ కా లగానా ఖేల్ నహీ ' యువతీ యువకులకు ప్రేమ 'ఒక ఆట 'కాదని బోధించే చక్కని పాట. ప్రేమిస్తే సరిపోదు ప్రేమను నిలుపుకోవటం ఆటకాదని చెప్తుందీ పాట. చివరలో 'కహదె యె కోయీ నాదానోంసే హం కో మిటానా ఖేల్ నహీ ' అన్న తీరు వింటే రఫీ తనకు ఇక ఎదురు లేదని సినీగేయ ప్రపంచంలో తన జైత్రయాత్రను ఎవరూ ఆపలేరని ప్రకటించినట్టనిపిస్తుంది. 'దులారీ'లో 'సుహానీ రాత్ ఢల్ చుకే' పాటలో రఫీ ఉచ్చస్థాయిలో స్వరాన్ని నర్తింపచేసి వెంటనే భూమిపైకి దిగిరావటం అద్భుతం. ఈ నేపథ్యంలో చూస్తే 'హన్స్ రాజ్ బహల్' సంగీత దర్శకత్వంలో పాడిన 'జిన్ రాతోం మె నీంద్ ఉడ్ జాతీహై' ప్రత్యేకత మరింత ప్రస్ఫుటమౌతుంది. ఎందుకంటే ఈ పాటలో వాయిద్యాల వాడకం అతి తక్కువ. ముషాయిరాలో పాడిన గజల్ ఇది. మొదటి రెండు పాదాలు (గజల్ పరిభాషలో 'మత్లా' అంటారు) అసలు సంగీతం ఉండదు. పాట కేవలం రఫీ స్వరమాధుర్య బలం మీద, గజల్ అర్థం మీదా ఆధారపడి శ్రోతను మెప్పిస్తుంది. ఈ పాట రఫీ పాడటం వెనుక ఒక కథ ఉంది.

సంగీత దర్శకుడు 'హన్స్ రాజ్ బెహల్ ' ఈ పాటను ముందుగా ముఖేష్ స్వరంలో రికార్డు చేశాడు. నిజానికి ఈ పాట పాడటం చాలా కష్టం. ముషాయిరాలో కవిత చదివినట్టు చదవాలి. పాట 'గజల్' అయినా, కాఫీ, భీం పలాసి, 'బహార్' రాగాల కలయిక. ఎక్కడా రాగం చెదరకూడదు. ఒక రాగం నుంచి మరో రాగానికి మారినట్టు శ్రోతకు తెలియకుండా, మారిపోవాలి. కానీ రాగాల ప్రభావం ఇనుమడించాలి. ముకేష్‌కు శాస్త్రీయ సంగీతం రాదు. పైగా పాటలో విషాదం, చిలిపితనం, వంటివి కనబడాలి. దాంతో ముకేష్ పాడిన విధానం సంగీత దర్శకుడికి నచ్చలేదు. అందుకని అర్థరాత్రి రఫీని పిలిపించి, తెల్లారేలోగా పాటను రఫీ స్వరంలో రికార్డు చేశారు. అంటే నిద్రరాని రాత్రి పాట నిద్రలేని రాత్రి రికార్డు చేశారన్నమాట.ఈ కష్టమైన పనిని మంచినీళ్లు గటగటా తాగినంత సులభంగా సాధించాడు రఫీ. ఈ పాట తరువాత రఫీ స్వరంపై సంగీత దర్శకులకు ఎంతగా నమ్మకం పెరిగిందంటే అసలు వాయిద్యాలు లేకుండా కేవలం రఫీ స్వరం ఆధారంగా బాణీలను రూపొందించటం ప్రారంభించారు. రఫీతో కవితలు చదివించారు.ఎస్ డీ బర్మన్ ప్యాసా( యె మహెలో, యె తఖ్తో, యె కూచే యె నీలాం ఘర్, తంగ్ ఆచుకేహై, యె హస్తే హువే ఫూల్ లాంటి పలు కవితలు) , కాగజ్ కే ఫూల్( బిఛ్డే సభీ బారి బారీ) వంటి సినిమాలలో, ఖయ్యాం షోలా ఔర్ షబ్నం (జానె క్యా ఢూంఢ్తీ రహెతీహై హై యె ఆంఖే ముఝ్ మే) సినిమాలో, ఎస్ ఎన్ త్రిపాఠి లాల్ ఖిల్లా( లగ్తా నహీ, న కిసీకి ఆంఖ్ క నూర్ హూన్) సినిమాలో, మదన్ మోహన్ షరాబీ (ముఝే లే చలో ఆజ్ ఉస్ గలీ మే) , హీర్ రాంఝా(మేరీ దునియా) , హాకీకత్ (మైన్ యే సోచ్ కర్) సినిమాల్లో, శంకర్ జైకిషన్ జాన్వర్( దాల్ లేక్ లో కవితలు) బర్సాత్ కీ రాత్ లో రోషన్( మైనె షయద్ తుమ్హే) , చిత్రలేఖ ( మన్ రే తూ కాహె న ధీర్ ధరే) తో సహా పలుసినిమాలలో... ఇలా సంగీతదర్శకులు కేవలం రఫీ స్వరం ఆధారంగా వాయిద్యాలులేకుండా బాణీలను సృజించారు.. అమరమైన గీతాలు రూపొందించారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే

ఈ పాట రాసింది అర్జూ లఖ్నవీ. వేల సంఖ్యలో గజళ్లు రాశాడు. ఒక లెక్కప్రకారం ఈయన 25వేల గజళ్లు రాశాడు! దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయాడు. భారత్‌లోనే ఉండి ఉంటే మహమ్మద్‌రఫీ స్వరంలో ఈయన గజళ్లు ఎన్నో ఈనాటికీ ప్రజల హృదయాలలో ప్రతిధ్వనిస్తూండేవి. 'జిన్ రాత్‌మే' పాట కూడా గజల్. దాన్ని సినిమాకు తగ్గట్టు మార్చారు. రెండు చరణాలు సినిమాకోసం ప్రత్యేకంగా మార్చిరాశాడు.

'కహర్' అంటే పట్టరాని కోపం, ఆవేశం, విషాదంతో నిండిన రాత్రి. 'కహర్ కి రాత్' అంటే, దైవానికి కోపం వచ్చి కలిగించే కష్టాలవంటి రాత్రన్నమాట. ఒక పెనుముప్పు రాత్రి. నిద్ర ఎగిరిపోయిన రాత్రి ఒక పెనుముప్పులాంటి రాత్రి.

ఇక్కడ 'నిద్ర ఎగిరిపోయిన రాత్రి' అనటం గమనార్హం. సాధారణంగా, పడుకున్న కాస్సేపటికి నిద్రపడుతుంది. కానీ మనసులో భయాలు, బాధలు, వేదనలు ఉన్నప్పుడు నిద్రపట్టదు. ఒకవేళ పట్టినా అది ఎగిరిపోతుంది. హృదయంలో గుబులు, బాధ నిద్రపోనివ్వదు. నిద్రపోతే బాధ తగ్గుతుంది. బాధ తగ్గితే నిద్రవస్తుంది.

**ఘిర్ ఘిర్ కె జో బాదల్ ఆతే హై, ఔర్ బిన్ బర్సే ఖుల్ జాతే హై**

**ఆషావోంకి ఝూటీ దునియామే, సూఖీ బర్సాతే హోతీ హై.**

మేఘాలు వడివడిగా వస్తున్నాయి. కానీ వర్షించకుండానే వెళ్లిపోతున్నాయి. లేనిపోని అబద్ధపు ఆశల ప్రపంచంలో ఎండిపోయిన వర్షాలు పడతాయి. 'సూఖీ' అన్న పదం గమ్మత్తయింది. 'సూఖీ' అంటే 'ఎండిపోవటం' అన్న అర్థం వస్తుంది. సన్నని నీటిపాయ, సన్నగా పడిపడని వర్షం అన్న అర్థాలు కూడా ఉన్నాయి. ఈ 'సూఖీ బర్సాత్' అన్న పదప్రయోగం అద్భుతం. దీనికి సరైన అర్థం చెప్పటం కష్టం. మనసుతో అనుభవించాల్సిందే. బర్సాత్ అంటే వర్షం 'సూఖీ బర్సాత్', 'ఎండిపోయిన వర్షం' ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు ఎండిపోతాయి. అయినా ఏడుపు ఆగదు. అలాంటి వర్షం. కానీ నీళ్ళు రావు 'సూఖీ బర్సాత్' మేఘాలు వస్తున్నాయి. వర్షం ఆశను కల్పిస్తున్నాయి. కానీ వర్షించకుండానే వెళ్ళిపోతున్నాయి. ఆబధపు ఆశలు నీరు లేని వర్షం లాంటివన్నమాట. అది 'సూఖీ బర్సాత్' Dry rain. అయితే ఈ పాదం భావం మరింత లోతుగా అర్థం కావాలంటే సినిమాలో వాడని దీనికన్నా ముందరి చరణం తెలుసుకోవాలి.

**ఆషో – ఎ – జుదాయీ క్యా కహీయే అన్‌హోనీ బాత్ హోతీ హై**

**ఆఖోమే అంధేరా ఛాతా హై జబ్ ఉజాలి రాత్ హోతీ హై**

'ఆ షో – ఎ – జుదాయీ..' అంటే విరహం. వేరవటం. ఆషోబ్ అంటే భయం. 'విరహవేదన భయం', వేరవటం వల్ల కలిగిన మానసిక వేదన. అలాంటి మానసిక వేదన గురించి ఏం చెప్పాలి, వింత వింత మాటలు దొర్లుతాయి. వింత వింత మాటలు ఈ వేదన గురించి చెప్తూంటే వస్తాయట. విచిత్ర పదప్రయోగాలు. వెలుగున్న రాత్రిలో కూడా కళ్లముందు చీకట్లు క్రమ్ముతాయన్నామాట. అలాంటి అన్‌హోనీ పదం 'సూఖీ బర్సాత్'

**జబ్ వో వహి హోతే పహలూమే ఔర్ లంబీ రాత్ హోతీహై**

**యాద్ ఆకే సతాతీ రహతీ హై ఔర్ దిల్ సే బాతే హోతీహై**

ఆమె తన సమక్షంలో లేనప్పుడు రాత్రి మరీ దీర్ఘంగా అనిపిస్తుంది. ఆమె గుర్తుకు వచ్చి బాధిస్తుంది. అప్పుడు తన హృదయంతో మాట్లాడుకుంటాడు. ఇది సినిమాలో వాడారు.

**హస్నేమే జో ఆసూ ఆతే హై, దో తస్వీరే దిఖ్లాతే హై**

**హర్ రోజ్ జనాజే ఉఠ్ తే హై, హర్ రోజ్ బారాతే హోతీ హై**

హస్నేమే జో ఆసూ ఆత్ హై, తరువాత దో తస్వీరే దిఖ్లాత్‌హై' అన్న స్థానంలో 'మై రంగ్ – ఎ – జహాన్ బత్లాత్‌హై' అని ఉంటుంది. 'జహాన్ ' అంటే ప్రపంచం. మైరంగ్ అంటే మోసం చేసి, మైమరపించటం. అంటే నవ్వితే వచ్చే కన్నీళ్లు మైమరపించే మోసపు రంగుల ప్రపంచాన్ని చూపిస్తాయన్నమాట. సినిమాలో ఈ 'మై రంగ్ – ఎ – జహాన్ ' అనే బదులు 'దో తస్వీరే దిఖ్లాతా హై' అన్నాడు. అంటే రెండు దృశ్యాలు చూపిస్తాయన్నమాట, నవ్వుతున్నప్పుడు వచ్చే కన్నీళ్లు. అవేమిటంటే ప్రతిరోజూ శవయాత్ర జరుగుతుంది. ప్రతిరోజూ పెళ్లి ఊరేగింపులు జరుగుతాయి. ఈ రెండు దృశ్యాలు. ఈ రెండు మోసం చేసే మైమరపించే దృశ్యాలు కనిపిస్తాయన్న మాట. నిజానికి కన్నీళ్ళు

వస్తున్నాయి. ఈ పరిస్థితిలో నవ్వు ఓ మోసం. ఆశ కలుగుతుంది. నవ్వుతాడు. నిజం కనిపిస్తుంది. ఏడుస్తాడు. పెళ్లి ఊరేగింపు, శవయాత్రలు దీనికి ప్రతీకలు.

**హిమ్మత్ కిస్‌కీ హై జో పూఛ్ సకే ఆర్జూ – ఎ – సోదాయీ సే**

**క్యూన్ సాహిబ్ ఆఖిర్ అకేలేమే యే కిస్ సే బాతే హోతీ హై**

'ఆర్జూ – ఎ – సౌదాయీ' అన్న పదాన్ని విడి విడిగా విడదీసి చూస్తే ఒక అర్థమొస్తుంది. కలిపి చూస్తే ఒక అర్థమొస్తుంది. సౌదాయీ అంటే విషాదం బాధతో ఉండేవాడు. ఆర్జూ అంటే కోరిక. బాధ యొక్క కోరికతో ఉండేవాడు అన్న అర్థం వస్తుంది. కానీ ఆర్జూ–ఎ–సౌదాయీ అంటే తమకేదో రోగం ఉందని భయపడుతూ బాధలో జీవించేవాడు. ఇతరులకు తేలికగా అనిపించినవి జీవన్మరణ సమస్యలా బాధపడేవాడు. ఆంగ్లంలో హైపోకాండ్రియాక్ అనుకోవచ్చు. ఎన్ని పరీక్షలు చేసినా ఏమీ రోగం కనబడదు. కానీ ఏదో రోగం వుందని బాధపడతారు. అలాంటివారిని ఎవరైనా ఏమడుగుతారు? అంతధైర్యం ఎవరు చేస్తారు? అడిగితే రోగాల చిట్టా చెపుతాడు. అది వినేవారికి హాస్యంగా వుంటుంది. ఇంతకీ ఒంటరిగా ఎవరితో మాట్లాడుతున్నావోయ్? అని గజల్ ను ముగిస్తున్నాడు. దీన్ని గజల్ ఆరంభంలోని నిద్ర ఎగిరిపోయిన రాత్రులు ఓ శిక్షలాంటివి, తలుపులతో ఢీ కొనటం, గోడలతో మాట్లాడటం వంటివాటితో అన్వయిస్తే, ఈ గజల్ మొత్తం తనలోతాను మాట్లాడుకుంటున్న మాటలు అని అర్థమవుతుంది. ఇది చూసేవారికి హాస్యం. అతనికి జీవన్మరణ సమస్య. ఇదీ అత్యద్భుతమయిన ఆర్జూ లఖ్నవీ గజల్.

ఈ పాట అర్థం తెలుసుకున్న తరువాత మరోసారి పాటవింటే రఫీ పాటనుపాడటంలో చూపిన చమత్కారం చక్కగా తెలుస్తుంది. మొదటి రెండు పాదాలను కవితను చదివినట్టు చదివి, ప్రతి షేర్ లో మొదటి పాదంలో మధ్యలో హై పిచ్ పాడి నెమ్మదిగా పైకి ఎగిరిన దూదిపింజ వంపులుతిరుగుతూ తేలుతూ క్రిందకి దిగినట్టు రెండవ పాదంలోకి జారటం గమనిస్తే పాటకు ప్రాణంపోయటం అంటే ఏమిటో తెలుస్తుంది. స్వరంతో మాజిక్ చేయటం అంటే ఇదే. ఇక్కడే ఒక విషయం ప్రస్తావించుకోవాల్సివుంటుంది.

చాలామంది సినిమాపాటలన్నా, సాహిత్యమన్నా, గాయనీగాయకులన్నా చులకన అభిప్రాయం వ్యక్తపరుస్తారు. శాస్త్రీయ సంగీత విద్వాంసులను గురించి గొప్పగా మాట్లాడి, సినీ గాయనీగాయకులగురించి చులకనగా మాట్లాడతారు. సినిమా పాటలను జాగ్రత్తగా గమనిస్తే, శాస్త్రీయ సంగీతం సూర్యుడయితే, సినిమాపాట చంద్రుడు అని అర్థమవుతుంది. ఎలాగయితే సూర్యకిరణాలవేడిని గ్రహించి చంద్రుడు శీతలకిరణాలను జగతిపై ప్రసరింపచేస్తాడో అలాగే శాస్త్రీయ సంగీతంలోని సంక్లిష్టతను

సరళీకరణం చేసి శాస్త్రీయ సంగీతాన్ని ఎలాంటి సంగీత జ్ఞానం లేని వాడుకూడా స్పందించేలా, శాస్త్రీయ సంగీతం వల్ల కలిగే బ్రహ్మానందాన్ని సంగీత పరంగా పామరుడు కూడా అనుభవించేలా చేస్తుంది సినిమా పాట. అంటే, ఒక శాస్త్రీయ సంగీత విద్వాంసుడు ఒక గంట పాటలో కలిగించే ఆనందానుభూతిని సినిమాపాట మూడు నాలుగు నిమిషాల్లో సాధించాలన్నమాట..సాధిస్తున్నది కూడా!!! దీన్లో సంగీత దర్శకుల శ్రమ, ప్రతిభలు ఎంతగా ఉంటాయో పాటపాడే గాయనీ గాయకుల పాత్రకూడా అంతే ఉంటుంది. ఒక శాస్త్రీయ సంగీత విద్వాంసుడు ఎంతటి సాధన చేస్తాడో, అంతకన్నా ఎక్కువ సాధన సినీకళాకారులు చేయాల్సి ఉంటుంది. శాస్త్రీయ సంగీతాన్ని ఆ పరిజ్ఞానం ఉన్నవారు అర్థం చేసుకుంటారు. లోటుపాట్లు ఎంచుతారు. సినిమా పాట గురించి చెవులు పనిచేసే ప్రతివాడూ, నాలిక కదిలే ప్రతివాడూ ఏమీ తెలియకున్నా ఇష్టం వచ్చినట్టు మాట్లాడేయవచ్చు. అంటే, శాస్త్రీయ సంగీత కళాకారుల చుట్టూ ఉన్న రక్షణ కవచం సినీ కళాకారులకు లేదన్నమాట. అలాంటప్పుడు పండితులనుంచి పామరుల వరకూ తరతరాలుగా మెప్పిస్తూ రావటం సామాన్యమైన విషయం కాదు. అలాంటి అసామాన్య విషయం అతి సామాన్య విషయంగా అనిపించేట్టు చేయగలిగిన సినీకళాకారులను చులకన చేయటం అవగాహనా రాహిత్యానికి, మిధ్యా అహంకారానికి నిదర్శనం.

'జిన్‌రాతోం' పాటనే తీసుకుంటే సంగీత దర్శకుడు 'హన్స్ రాజ్ బెహల్' పాటను ఎంత జాగ్రత్తగా రూపొందించాడంటే, ఒక శిల్పి శిల్పాన్ని శిల్పం చేతి పై నరాలను, మెడలో గొలుసులలోని పూసలపై ప్రతిఫలించే వెలుగును ఎంత జాగ్రత్తగా చెక్కుతాడో అంతే దీక్షతో, జాగ్రత్తగా రూపొందించాడు. పాటను పాడిన రఫీ కూడా ఒక శాస్త్రీయ సంగీత విద్వాంసుడు తన గానంలో మీండ్ (ఒక స్వరం నుంచి మరో స్వరంలోకి జారటం), ఆందోళన (ప్రత్యేక పదాలలో ఊపు), గమకాలు, ఖట్కాలు (కొన్ని స్వరాలను కలిపి పలకటం వేగంగా), ముర్కిలను ఎంత జాగ్రత్తగా, ఆనందం అనుభవిస్తూ అలంకరిస్తాడో, అలా పాడాడు. శ్రోతలకు శాస్త్రీయ సంగీత సభ వింటున్న భావనరాదు. కానీ అనుభవిస్తాడు, ఆ శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని. పాట రాత్రి పూట ఒంటరితనం గురించి కాబట్టి కాఫీ, బహార్ రాగాలను వాడాడు. విరహ వేదనను సూచించే రాగం కాఫీ. రాత్రి రెండవ ఝాములో పాడాలి ఈ రాగం. భీమ పలాసి, బహార్ రాగాలు దీనికి దగ్గర సంబంధం కలవి.

వీటిల్లో 'బహార్' రాగం కూడా అర్ధరాత్రి రాగం. శృంగార రసరాగం ఇది. భీమపలాసి రాగం కొత్తగా పెళ్లయిన భార్యాభర్తల సరసాన్ని స్ఫురింపచేసే రాగం. లేదా ప్రేయసి అందాన్ని చూసి మైమరచి పాడే రాగం. ఈ మూడు రాగాలను రాగమాలికలా గుదిగుచ్చి పదాల భావానికి తగ్గ రాగం వాడి పాట ప్రభావాన్ని ఇనుమడింపచేశాడు సంగీత దర్శకుడు. ఇక రఫీ పాటను తన స్వర తరంగాల ప్రవాహంతో అలంకరించిన తీరు ఏ శాస్త్రీయ విద్వాంసుడి గానం కన్నా ఏమీ తక్కువ కాదు. 'హృదయానికి చెవులుంటే జగమంత నాదమయం ' అంటారు. అలా సంగీతంలో స్థాయి భేదాలు, భేద భావాలు ఉండవు. బిచ్చగాడి పాటలోనూ, బైరాగి పాటలోనూ, పొలాల్లో పని వాళ్ల పాటలో, పల్లెల గీతాల్లో, మందిరాల్లోని భజనల్లో, కీర్తనల్లో, శృంగార గీతాల్లో జీవితంలోని ప్రతి అడుగులో, ప్రతిశ్వాసలో సంగీతం ఉంది. సంగీతం సరస్వతి. ఎలాగయితే వెన్నెల పూరి గుడిసెపైన అయినా, మురికినీటిపైన అయినా, పూలతోటలో అయినా ఎలా ఇదే రకంగా వెలుగుతుందో, అలాగే సంగీతం ఏ రూపంలో అయినా అంతే అద్భుతం, అంతే పవిత్రం. అంతే బ్రహ్మానంద భరితం. దాన్లో తేడాలు చూసేవారికి సంగీతం అంటే తెలియదు. అలాంటివారిది పాషాణ హృదయం తప్ప నాద హృదయం కాదు.

## (వచ్చే నెలలో మరిన్ని నిద్రరాని రాత్రుళ్ల పాటలు పాడుకుందాం)

Post your comments